క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



తొర్రూరు రూరల్ : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాల శ్రావణ్‌కుమార్ ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతడికి వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేద కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం లింగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘కేంబ్రిడ్జి’ డాక్టరేట్‌కు శ్రీనివాస్ ఎంపిక



మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రానికి చెందిన కనుమర్లపూడి శ్రీనివాస్‌కు కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఆయన సుమారు రెండు దశాబ్దాలుగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణలో, 23 ఏళ్లుగా బైలింగ్వల్ స్ట్రక్చరల్ విధానంలో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణను సులభంగా 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతోపాటు విశిష్ట సేవలు అందించడంతో డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఆయన జన విజ్ఞాన వేదిక, వాసవి క్లబ్ ద్వారా ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణా శిబిరాలు, ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంగ్లిష్ ఫేర్ లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 9న గోవాలో జరగనున్న స్నాతకోత్సవంలో శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్ ప్రారంభించాలని వినతి

మహబూబాబాద్ : మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కేలోత్ సాయికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శశాంకకు కలెక్టరేట్‌లో గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సాయికుమార్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడచినా మోడల్ స్కూల్ హాస్టల్ ప్రారంభించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి రావడం ఇబ్బందిగా ఉందని చెప్పారు. ఇకనైనా హాస్టల్ ప్రారంభించకపోతే ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు సూర్యప్రకాష్, సింహాద్రి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని మహర్షి విద్యాలయ సమీపంలోని ఓ ఆటోలో నిల్వ ఉంచిన 3 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై వీ.దీపికరెడ్డి తెలిపారు. మండలంలోని వేమునూరు గ్రామానికి చెందిన నలమాస రమణ ఆరు బస్తాల్లో బియ్యంను ఓ ఆటోలో మహర్షి విద్యాలయ సమీపంలో నిలుపగా పెట్రోలింగ్ చేస్తున్న ఏఎస్సై అహ్మద్ తనిఖీ చేశాడు. పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తరలించి కేసు నమోదు చేశారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

గార్ల : మండల కేంద్రానికి చెందిన బత్తికి కృష్ణ అద్దెకు తీసుకున్న వెంకటేశ్వరస్వామి ఆలయ బజార్‌లోని ఇంటి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 2 క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటా పటికను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఆ శాఖ సీఐ చిరంజీవి తెలిపారు. మీడియాకు సీఐ వివరాలు వెల్లడించారు. కృష్ణ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గుట్టుగా ప్రభుత్వ నిషేధిత నల్లబెల్లం, పటికను నిల్వ చేసి అధిక ధరకు గుడుంబా తయారీదారులకు అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం అందడంతో దాడి చేసి నల్లబెల్లం, పటికపాటు రెండు వేయింగ్ మిషన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కృష్ణ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. అలాగే తహసీల్దార్ బజార్‌లో సరస్వతి అనే మహిళ నుంచి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది వెంకటనర్సయ్య, శ్రీనివాస్, హచ్చ తదితరులు పాల్గొన్నారు.

‘పాలకుర్తిలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం’

పెద్దవంగర : రానున్న ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాడిశెట్టి సైదులు, నాయకులు తోటకూరి శ్రీనివాస్, ఓరుగంటి సతీష్, రంగు మురళి, హరికృష్ణ, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

మహబూబాబాద్: వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



కురవి : నాగార్జున స్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



ఊరూరా ఘనంగా శ్రీకృష్ణాష్టమి

జిల్లావ్యాప్తంగా ఊరూరా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపిక వేషధారణలో అలరించారు. యువకులు గరుడ స్తంభాలను ఎక్కి ఉట్టి కొట్టారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ప్రజాప్రతినిధులు పాల్గొని ఉత్సాహం నింపారు.

–సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: విద్యాభారతి స్కూల్‌లో..



చిన్నగూడూరులో..



మహబూబాబాద్ రూరల్ : ఆలయంలో భక్తులు



బయ్యారం: ఉట్టికొడుతున్న పిల్లలు



గార్లలో..



గోపికగా అద్వైతరామ్



గూడూరు : అంగన్‌వాడీ సెంటర్‌లో..

‘బీఆర్‌ఎస్‌లో అంతర్గత కుమ్ములాటలు’

దంతాలపల్లి : బీఆర్‌ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు నెలకొన్నాయని బీజేపీ అనుబంధ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు దేవికానాయక్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళిత బంధు, ఇతర పథకాలు అర్హులకు ఇవ్వకుండా ఎమ్మెల్యే అభాసు పాల్జేస్తున్నాడని బీఆర్‌ఎస్ శ్రేణులే ఆరోపిస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే అనడం సరికాదన్నారు. ఇకనైనా గ్రామాల వారీగా సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నిధులు మొత్తం కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని చెప్పారు. రెడ్యానాయక్ పాలనలో నియోజకవర్గం అభివృద్ధి నోచుకోలేదని తెలిపారు. రెడ్యానాయక్ పాలనకు చరమగీతం పాడాలని సూచించారు. అనంతరం మేరీ మాటి కార్యక్రమంలో నాయకులతో కలిసి పాల్గొని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మట్టిని స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ తాడ పూర్ణచందర్, మండల అధ్యక్షులు దాసరి మురళి, అల్లం సాయి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు రాణిరెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దేవికానాయక్

కాంగ్రెస్ గెలిస్తే ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు

గార్ల : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తే వెంటనే పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని ఆ పార్టీ ఇల్లందు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రామచంద్రునాయక్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు రైతులకు ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని, పింఛన్లు రూ.4 వేలకు పెంచుతామని తెలిపారు. ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈనెల 17న హైదరాబాద్‌లో తలపెట్టిన బహిరంగ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి శ్రేణులు తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు మండ రాముగౌడ్, చిలుక బాబు, జువ్వాజి శ్రీనివాస్, బాదావత్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రునాయక్

కాంగ్రెస్ సంకల్ప యాత్ర ర్యాలీ

గార్ల : ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది గడుస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం సంకల్ప యాత్ర ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, నాయకులు మండ రాముగౌడ్, గుండా వెంకట్‌రెడ్డి, హతీరాం, భూక్యా నాగేశ్వర్‌రావు, చిలుక బాబు, శారద, పృధ్వీనాయక్, లక్ష్మణ్, వినోద, భద్రు, భావ్ సింగ్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, పూర్ణచందర్, వీరన్న, లింగ్యానాయక్, యాకన్న, వెంకన్న, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గట్ల గణేష్, ఎంపీటీసీ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



గార్ల : ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి



మహముద్‌పట్నంలో మాట్లాడుతున్న కొండపల్లి రాంచందర్‌రావు

కేసముద్రం : టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని శ్రేణులను ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్ రావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భుక్యా సునీత కోరారు. మండలంలోని మహముద్‌పట్నంలో గురువారం నిర్వహించిన సమావేశం వారు మాట్లాడారు. నియోజకవర్గంలో మండల కమిటీలను వేస్తున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు పాటుపడాలని చెప్పారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఏశబోయిన ఎల్లయ్య, అధికార ప్రతినిధి ప్రేమ్‌చంద్, మండల ప్రధాన కార్యదర్శులు గుగులోతు రాజు, కుమార్, మల్లేష్, రాజు, లక్ష్మణ్, ముత్తయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు హుస్సేన్‌నాయక్

గూడూరు : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలని బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ కోరారు. మండలంలోని చిన్న ఎల్లాపురం, భూపతిపేట, సీతానగరం, లైన్‌తండా గ్రామాల్లో గురువారం చేపట్టిన ‘పల్లెపల్లెకు బీజేపీ.. ఇంటింటికీ జాటోతు హుస్సేన్‌నాయక్ ప్రజాఆశీర్వాద యాత్ర’ను ఆయన ప్రారంభించారు. తొలుత చిన్న ఎల్లాపురం శివారులోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసి లక్ష్మణ్‌తండా, చెరువుకొమ్ముతండా, కారంపాడితండా, చిన్న ఎల్లాపురంల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేరిట గ్రామ పంచాయతీలుగా మార్చిన గిరిజన గ్రామాలు, తండాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ కుటుంబ స్వార్థం కోసం ప్రజలు ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజలు బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెందారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించి బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు, మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న, నాయకులు మేరెడ్డి సురేందర్, శ్రీశైలం, వడ్డకొండ యాకయ్యగౌడ్, మేరుగు మల్లయ్యగౌడ్, రాంబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, యాకయ్య, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం

డోర్నకల్ : మండలంలోని పలు గ్రామాల్లో 13 బీటీ రోడ్ల నిర్మాణానికి ఐటీడీఏ నుంచి రూ.25.57 కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి హనుమంతరావు, సురేష్‌కుమార్ పాట్ని, మాదా శ్రీనివాస్, జర్పుల వీరన్న, భద్రునాయక్, వీరన్న, మైనుపాషా తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం : మండలంలోని పలు తండాలకు ఐటీడీఏ ద్వారా రూ.33 కోట్లు మంజూరు చేయడంతో బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడారు. మారుమూల గ్రామాలను, తండాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరూనాయక్, కొమ్ము రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి..

నెల్లికుదురు : మండలంలోని జామతండా, పంతులు తండాల వరకు 3.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ నుంచి రూ.3.50 కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జామతండా సర్పంచ్ మౌనిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతి, వెంకన్న, శ్రీధర్, రవి, భీమా, సురేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణకొత్తపల్లిలో..

శ్రీహరి తండా వరకు బీటీ రోడ్డుకు ప్రభుత్వం రూ.2.25 కోట్లు మంజూరు చేయడంతో తొలుత సర్పంచ్ చింతకుంట్ల యాకయ్య, ఉపసర్పంచ్ యాకాంతం, నాయకులు బొల్లి మురళీ, తదితరులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామంలోని అదే రోడ్డుపై తదనంతరం సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్ చిత్రపటానికి వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ వర్గం క్షీరాభిషేకం చేసింది.



డోర్నకల్ : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సమ్మెకు సంఘీభావం

మహబూబాబాద్ : తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోతు కిషన్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్, పలు సంఘాల నాయకులు గురువారం సంఘీభావం తెలిపారు. అనంతరం సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

వేట వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా అమర్‌చంద్



గార్ల : మండలంలోని మర్రిగూడెం గ్రామంలోని వేట వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బానోత్ అమర్‌చంద్‌ను నియమిస్తూ ఎండోమెంట్ గురువారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా బూడిద రాణి, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ రమేష్, సభ్యులుగా మల్లం నరేందర్, మేకల వెంకటేశ్వర్లులను నియమించారు. నూతన కమిటీని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అభినందించారు.

పేద విద్యార్థినికి ‘అభయ’ చేయూత

తొర్రూరు రూరల్ : మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని ధర్మారపు వాణిశ్రీకి అభయ ఫౌండేషన్ చేయూత అందించింది. వాణిశ్రీ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా ఆమె కోసం ఆమె తండ్రి నాగన్నకు ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం సుమారు రూ.50 వేల విలువైన ల్యాప్‌టాప్ అందించారు. మూడేళ్ల విద్య కొనసాగించేందుకు రూ.1.50 లక్షలు సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 100 స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు చిట్టిమళ్ల మనోజ్‌కుమార్, చిట్టిమళ్ల మహేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని సాలార్‌తండాలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన జాటోత్ రమేష్–అమల దంపతుల కొడుకు కార్తీక్ పశువులను కాసేందుకు వెళ్లిన క్రమంలో విద్యుత్ తీగలు తగిలి గాయాల పాలయ్యాడు. కార్తీక్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు

దంతాలపల్లి : మండలంలోని పడమటిగూడెం –బీరిశెట్టిగూడెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి ఇద్దరి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఖమ్మంకు చెందిన వెంకటేశ్వర్లు ఆటోను కిరాయికి తీసుకొని మిరుపనారు తీసుకొచ్చేందుకు తొర్రూరు దిశగా వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే ప్రయత్నంలో ఆటో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును కుడివైపు రాసుకుంటూ వెళ్లి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సోందుకు, అందులో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయలయ్యాయి. తొర్రూరు టౌన్ సీఐ సత్యనారాయణ ఘటనా స్థలికి సందర్శించి విచారణ చేపట్టారు.

జర్నలిస్టుకు ఎంపీ పరామర్శ

చిన్నగూడూరు : జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు కట్ల రాజును అతడి తండ్రి సత్తయ్య ఇటీవల మృతి చెందిన క్రమంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత గురువారం పరామర్శించారు. తొలుత ఆమె రాజు నివాసానికి చేరుకుని సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వల్లూరి పద్మ వెంకట్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, మండల కోఆప్షన్ సభ్యుడు మోసిన్ బేగ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

ఇంటికన్నెలో..

కేసముద్రం : మండలంలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన నద్దునూరి కొమురమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, సర్పంచ్ గణపారపు సరిత రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

డోర్నకల్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వెంపటి సీతారాములు ఆధ్వర్యంలో ఎంఈఓ పూల్‌చంద్‌ను పూలమాల వేసి శాలువా కప్పి గురువారం ఘనంగా సన్మానించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన సాంపంగి రియల్ ఎస్టేట్స్ యజమాని సాంపంగి రమేష్ పంపిన గిఫ్ట్ బ్యాగులను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా బద్రినారాయణ, సతీష్‌రెడ్డి, మండల కార్యదర్శి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మూడిళ్లలో చోరీకి యత్నం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రముఖులు నివాసం ఉండే హైమా గార్డెన్స్‌లోని మూడిళ్లలో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. మూడు ఇళ్ల తాళాలను దొంగలు పగులగొట్టి చోరీకి యత్నించారు. కాగా మూడిళ్లలోనూ డబ్బు, బంగారం, ఇతర ఆభరణాలు చోరీకి గురి కాలేదు. స్థానికులు చోరీ యత్నాన్ని గుర్తించి సమాచారం అందించగా పోలీసులకు గురువారం విచారణ చేపట్టారు.

టేకు చెట్ల అపహరణ

కేసముద్రం : మండలంలోని కేసముద్రం–తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైల్వేట్రాక్‌కు ఇరువైపులా ఉన్న టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అపహరించారు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. కేసముద్రం–తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న 425/26 కిలోమీటర్ రాయి వద్ద రైల్వేట్రాక్‌కు ఇరువైపులా రైల్వేబౌండరీలో పెరిగిన సుమారు 10 టేకు చెట్లను అక్రమంగా నరికేసి అపహరించడంపై రైల్వే సిబ్బంది ఫిర్యాదు మేరకు ఆర్‌పీఎఫ్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు.

ప్రైవేటు సంస్థ ఉద్యోగిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : డబ్బులు సొంతానికి వాడుకున్నందుకు ఓ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక టౌన్ ఎస్సై విజయరాంకుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లాలోని తొర్రూరుకు చెందిన వల్లపు విష్ణు నైటెక్స్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. వినియోగదారులకు, కిరాణా షాపులకు సరుకులు సరఫరా చేయడం ద్వారా వచ్చిన రూ.5 లక్షలను అందులోనే పని చేస్తున్న ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మల్లారం గ్రామానికి చెందిన కుక్కల రాజ్‌కుమార్ అనే మరో ఉద్యోగికి విష్ణు ఇచ్చి సంస్థ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని చెప్పారు. కాగా రాజ్‌కుమార్ సదరు రూ.5 లక్షలను సొంతానికి వాడుకున్నాడు. దీంతో విష్ణు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

తొర్రూరు : నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటర్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో కంఠాయపాలెం ఉపసర్పంచ్ రామ్మూర్తి, నాయకులు సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై బాలికలకు అవగాహన అవసరం

డోర్నకల్ : హక్కులపై బాలికలకు అవగాహన అవసరమని షీ టీమ్ ఎస్సై సునంద తెలిపారు. మైనార్టీ స్కూల్‌లో బాలికల చట్టాలు, హక్కులపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై ఝాన్సీ, భరోసా లీగల్ అడ్వైజర్ సాహితి, ఊర్మిల, షీ టీఎం ఏఎస్సై ఆనందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తొర్రూరు : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి ఎర్రబెల్లి విస్మరించిన హామీలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి వంశీకృష్ణ, నియోజకవర్గ కోఆర్డినేటర్లు నక్క యాకస్వామి, కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

నెహ్రూసెంటర్ : ఐక్యపోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రజా, కులసంఘాలతో గురువారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ హామీని అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చేలా అన్ని సంఘాలు ఐక్యంగా పోరాడాలని ఆకాంక్షించారు. ఆ పార్టీ జిల్లా కన్వీనర్ శాగంటి రమేష్ అధ్యక్షత వహించగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, డీఎస్‌యూ జిల్లా నాయకుడు మంద శశి, టీవీవీ జిల్లా అధ్యక్షులు చిత్తారి సోమన్న, పేరం వీరస్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్, పాలెపాక ప్రవీణ్, కత్తుల రేణుక, రజియాబేగం, మిర్యాల శ్రీనివాస్, కందిపాటి భిక్షపతి, శ్రీను, అంజిబాబు, రవి, శ్రీను, సురేష్, పాలెపాక శంకర్, రజిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.